# పెన్ పవర్
తెలంగాణ రౌండప్

శుక్రవారం 11 ఏప్రిల్2025 పేజీలు 8


# హైదరాబాద్ లో రేపు వైన్ షాపులు, బార్లు బంద్

- ఈ నెల 12న హనుమాన్ జయంతి
- మద్యం దుకాణాలను మూసివేయాలంటూ పోలీసుల ఆదేశాలు
- 12వ తేదీ ఉదయం 6 గంటల నుంచి 13వ తేదీ ఉదయం 6 గంటల వరకు వైన్ షాపులు బంద్



**హైదరాబాద్ పెన్ పవర్:**హైదరాబాద్ లోని మందుబాబులకు బ్యాడ్ న్యూస్.రేపు (12వ తేదీ, శనివారం) వైన్ షాపులు, బార్లు మూతపడనున్నాయి. హనుమాన్ జయంతి సందర్భంగా మద్యం దుకాణాలను మూసి వేయాలని పోలీసులు ఆదేశాలు జారీ చేశారు. పోలీసుల ఆదేశాల ప్రకారం 12వ తేదీ ఉదయం 6 గంటల నుంచి 13వ తేదీ ఉదయం 6 గంటల వరకు మద్యం దుకాణాలు మూతపడనున్నాయి. వైన్ షాపులు, బార్లతో పాటు కల్లు కాంపౌండ్ లను కూడా మూసివేయాలని పోలీసులు ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల జరిగిన శ్రీరామ నవమి సందర్భంగా కూడా మద్యం దుకాణాలు మూతపడ్డాయి.

# స్లాట్ బుకింగ్ పద్ధతిని.. పరిశీలించిన కలెక్టర్..



### కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్టార్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్..

### తక్కువ సమయంలో మెరుగైన సేవలు అందించే స్లాట్ బుకింగ్ విధానం..

### వెబ్‌సైట్ మాడ్యూల్, ఆన్‌లైన్‌లో దశల వారీగా పనిచేసే విధానంపై ఆరా..


**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఏప్రిల్ 10:**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన స్లాట్ బుకింగ్ విధానంతో తక్కువ సమయంలో ఎక్కువ రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియని గురువారం అమలు చేశారు.. రిజిస్ట్రేషన్‌ల పారదర్శకత, అవినీతి రహితంగా, సులువుగా, తక్కువ సమయంలో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఈ స్లాట్ బుకింగ్ పద్ధతిని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ పోట్రు అన్నారు.. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో దస్తావేజుల రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుకింగ్ విధానాన్ని గురువారం నుండి అమలు పరుస్తున్న ప్రక్రియను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ పరిశీలించారు.. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు

-2లో

# సీఎం రేవంత్ రెడ్డికి బీజేపీ ఎంపీ లక్ష్మణ్ కౌంటర్


- తుమ్మితే ఊడిపోయే ముక్కులాంటివని కాంగ్రెస్ ప్రభుత్వాలపై సెటైర్
- తెలంగాణ రజాకార్లను తరిమికొట్టినట్లు కాంగ్రెస్ ను దేశం నుంచి తరిమేస్తామని వ్యాఖ్య
- కాంగ్రెస్ నేతలే బ్రిటీష్ వారసత్వం అందిపుచ్చుకున్నారని మండిపాటు

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలో బీజేపీని బలపడనివ్వబోమని రాష్ట్ర ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నేత రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. గుజరాత్ లోని అహ్మదాబాద్ లో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. తాజాగా ఈ వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీ, సీనియర్ నేత కే లక్ష్మణ్ స్పందించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రస్తుతం దేశవ్యాప్తంగా తెలంగాణ, కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్ లలో కాంగ్రెస్ అధికారంలో ఉందని చెప్పారు. ఆ మూడు రాష్ట్రాల్లోని ప్రభుత్వాల పరిస్థితి తుమ్మితే ఊడిపోయే ముక్కులాగే ఉందని ఎద్దేవా చేశారు. నిజాం పాలనలో రజాకార్లను తరిమికొట్టినట్లు దేశం నుంచి కాంగ్రెస్ ను తరిమికొట్టడం ఖాయమని లక్ష్మణ్ చెప్పారు. తెలంగాణలో కాంగ్రెస్ మరోమారు అధికారంలోకి రావడం అసాధ్యమని, ఆ పార్టీ నుంచి రేవంత్ రెడ్డే చివరి ముఖ్యమంత్రి అని అన్నారు. రేవంత్ రెడ్డిలో అసహనం, అభద్రత కనిపిస్తోందని, ఆ ఆందోళనతోనే రాహుల్ గాంధీ మెప్పుకోసం బీజేపీపై అడ్డగోలుగా విమర్శలు చేస్తున్నారని అన్నారు. బీజేపీ నేతలది బ్రిటీష్ వారసత్వం అంటూ రేవంత్ చేసిన వ్యాఖ్యలను లక్ష్మణ్ తీవ్రంగా ఖండించారు. నిజానికి బ్రిటీష్ పాలకుల వారసత్వాన్ని అందిపుచ్చుకున్నది కాంగ్రెస్ నేతలేనని విమర్శించారు.



## ఈతను పాఠ్యాంశంగా చేర్చండి..!

# ఆర్డీవోకు వినతిపత్రం..!



ఆర్డీవో శ్యామ్‌ప్రకాష్‌కు వినతిపత్రం అందజేస్తున్న రవిందర్ ముదిరాజ్..

-2లో

- కేంద్ర, రాష్ట్ర విద్యాశాఖలు ఈత ఒక సాధనంగా గుర్తించాలి: రవిందర్..
- వేసవి సెలవుల్లో బావుల్లో, చెరువుల్లో ఈతకు వెళ్ళి మృత్యువాత పడుతున్నారు.
- ఈత నేర్చుకున్న విద్యార్థులకు ఏదైనా ఒక సబ్జెక్ట్‌లో 2 మార్కులు చేర్చేవిధంగా..
- పర్యావరణ ప్రేమికుడు సామాజిక వేత్త కోలా రవిందర్ ముదిరాజ్ ఆర్డీవోకి విజ్ఞప్తి..

# కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారం.. కేటీఆర్, హరీశ్ రావుపై రఘునందన్ రావు తీవ్ర విమర్శలు



- బీఆర్ఎస్ ప్రభుత్వంలో భూములను అడ్డగోలుగా అమ్మేశారని ఆరోపణ
- దొంగే దొంగ దొంగ అని అరిచినట్లుగా ఉందని విమర్శ
- బీఆర్ఎస్ హయాంలో రికార్డుల్లోకి ఎందుకు ఎక్కించలేదని నిలదీత

**హైదరాబాద్ పెన్ పవర్:**హైదరాబాద్ నగరంలోని కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై బీజేపీ నేత, మెదక్ లోక్‌సభ సభ్యుడు రఘునందన్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు. 400 ఎకరాల భూముల అంశంలో దొంగే దొంగ దొంగ అని అరిచినట్లుగా ఉందని కేటీఆర్, హరీశ్ రావును ఉద్దేశించి అన్నారు. బీఆర్ఎస్ నేతల తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో భూములను అడ్డగోలుగా అమ్మేశారని ఆరోపించారు. బీఆర్ఎస్ పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఇప్పుడు ప్రశ్నిస్తున్న కేటీఆర్, హరీశ్ రావు ఎక్కడకు పోయారని నిలదీశారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (హెచ్‌సీయూ) భూములపై ఎందుకు సమీక్ష చేయలేదో చెప్పాలని అన్నారు. హెచ్‌సీయూ రికార్డులలోకి ఎందుకు ఎక్కించలేదని నిలదీశారు. ఇప్పుడు మాత్రం బీఆర్ఎస్ నేతలు మొసలి కన్నీరు కారుస్తున్నారని ఆరోపించారు. విశ్వవిద్యాలయ భూములను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. హెచ్‌సీయూ భూములను కాపాడాలని తాము కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిశామని, ఇంచు భూమి పోకుండా విద్యార్థుల తరపున పోరాడుతామని హామీ ఇచ్చారు.

## వాళ్లు చేసిన కొన్ని పనుల వల్ల మనసు విరిగిపోయింది..

# అందుకే ఇంత దూరం వచ్చింది

తాజాగా ఓ యూట్యూబ్ ఛానల్‌తో తన ఫ్యామిలీ గొడవలపై మాట్లాడిన మనోజ్

ఇల్లు, ఇతర ఆస్తులపై తనకు ఏమాత్రం ఇష్టం లేదని వెల్లడి

తనపై పగ, ప్రతీకారాలు తీర్చుకోవడానికే దాడులకు పాల్పడుతున్నారని వ్యాఖ్య

గొడవల్లోకి తన భార్యను లాగారంటూ ఆవేదన

అలా చేయకపోయి ఉంటే తాను ఇంత దూరం వచ్చే వాడిని కాదన్న మంచువారబ్బాయి

**హైదరాబాద్ పెన్ పవర్:**గత కొంతకాలంగా మోహన్‌బాబు కుటుంబం... ఫ్యామిలీ గొడవలతో వరుసగా వార్తల్లో నిలుస్తున్న విషయం తెలిసిందే. బుధవారం నాడు మరోసారి మంచు మనోజ్ జల్‌పల్లిలోని నివాసం ముందు బైఠాయించి నిరసనకు దిగారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన మంచు మనోజ్ కీలక వ్యాఖ్యలు చేశారు. తమది ఆస్తి గొడవ కాదని, తన జుట్టు విష్ణు చేతుల్లో పెట్టేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు.

ఇక తాజాగా ఓ యూట్యూబ్ ఛానల్‌తో తన ఫ్యామిలీలో జరుగుతున్న గొడవలపై మంచు మనోజ్ మాట్లాడారు. ఇది ఆస్తి తగాదా కాదని ఆయన మరోసారి స్పష్టం చేశారు. ఇల్లు, ఇతర ఆస్తులపై తనకు ఏమాత్రం ఇష్టం లేదన్నారు. వాళ్లు చేసిన కొన్ని పనుల వల్ల తన మనసు విరిగిపోయిందని అన్నారు. తనపై పగ, ప్రతీకారాలు తీర్చుకోవడానికే ఈ దాడులకు పాల్పడుతున్నారని ఆయన వాపోయారు.

మంచు మనోజ్ మాట్లాడుతూ... "విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రశ్నించిన సందర్భంలో గొడవలు మొదలయ్యాయి. సుమారు రెండేళ్ల నుంచి గొడవలు జరుగుతున్నాయి. వారిని ప్రశ్నించాననే కారణంతో నా గౌరవానికి భంగం కలిగించే తప్పుడు కథనాలు ప్రచారం చేశారు. నాపై దాదాపు 30కి పైగా తప్పుడు కేసులు పెట్టారు. నాన్న ఆస్తిలో ఒక్క రూపాయి కూడా ఆశించలేదు.

ఈ గొడవల్లోకి నా భార్యను లాగారు. అలా చేయకపోయి ఉంటే నేను ఇంత దూరం వచ్చే వాడిని కాదు. తన వల్లే చెడిపోతున్నానంటూ స్టేట్‌మెంట్ ఇచ్చారు. ఎఫ్ఐఆర్‌లో నా భార్యాబిడ్డల పేర్లు చేర్చడంతో నా మనసు విరిగిపోయింది. నేను ఆస్తి అడగలేదు. ఏ తప్పు చేయలేదు. అందుకే దేనికీ భయపడను" అని మనోజ్ చెప్పుకొచ్చారు. ?

## గ్రూప్-1 నియామకాలు... సర్టిఫికెట్ వెరిఫికేషన్ తేదీలు ప్రకటించిన టీజీపీఎస్సీ

- **నాంపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి వర్సిటీలో గ్రూప్ -1 పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన**
- **ఈ నెల 16,17,19,21వ తేదీల్లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్**
- **ఎంపికైన వారు ఒరిజినల్ సర్టిఫికెట్లతో వెరిఫికేషన్‌కు రావాలని టీజీపీఎస్సీ సూచన**

**హైదరాబాద్ పెన్ పవర్:**గ్రూప్–1 నియామకాలకు సంబంధించి తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ఒక ముఖ్యమైన ప్రకటన విడుదల చేసింది. గ్రూప్–1 పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ తేదీలను టీజీపీఎస్సీ ప్రకటించింది.

గ్రూప్ 1 పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు తమ సర్టిఫికెట్లను ఈ నెల 16, 17, 19, 21 తేదీల్లో వెరిఫికేషన్ చేయించుకోవాల్సి ఉంటుంది. నాంపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి వర్సిటీలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జరుగుతుందని టీజీపీఎస్సీ తెలిపింది.

సర్టిఫికెట్ల పరిశీలనకు ఎంపికైన అభ్యర్థుల జాబితా టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుందని కమిషన్ వెల్లడించింది. ఎంపికైన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో వెరిఫికేషన్‌కు హాజరుకావాలని సూచించింది.

# స్లాట్ బుకింగ్ పద్ధతిని.. పరిశీలించిన కలెక్టర్..



కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ పరిశీలన..





- మొదటి పేజి తరువాయి

వారికి అనుకూలమైన తేది, సమయాన్ని registration.tlangana.gov.in వెబ్ సైట్‌లో ఎంపిక చేసుకుని, రిజిస్ట్రేషన్ వచ్చే విధంగా ప్రభుత్వం వెసలుబాటు కల్పించిందని అన్నారు.. రాష్ట్రంలోని కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రయోగాత్మకంగా చేపట్టిన ప్రక్రియలో భాగంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రారర్ కార్యాలయంలో పరిశీలించారు..

ఇందులో భాగంగా గురువారం ఎన్ని స్లాట్‌లు బుక్ అయ్యాయని సబ్ రిజిస్ట్రార్‌ను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. స్లాట్ బుకింగ్ విధానంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఏలా జరుగుతుందని, ఆన్‌లైన్‌లో క్షుణ్ణంగా తెలుసుకున్నారు. వెబ్‌సైట్ మాడ్యూల్స్‌ను ఆన్‌లైన్ ప్రక్రియలో దశలవారీ విధానంపై అడిగి తెలుసుకున్నారు. దస్తావేజుల రిజిస్ట్రేషన్, ఆన్ లైన్ ఫోటో, స్కానింగ్ చేసే విధానాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ తహసీల్దారు స్వామి, తదితరులు పాల్గొన్నారు..

# ఈతను పాఠ్యాంశంగా చేర్చండి..! ఆర్డీవోకు వినతిపత్రం..!

- **కేంద్ర, రాష్ట్ర విద్యాశాఖలు ఈత ఒక సాధనంగా గుర్తించాలి: రవిందర్..**
- **వేసవి సెలవుల్లో బావుల్లో, చెరువుల్లో ఈతకు వెళ్ళి మృత్యువాత పడుతున్నారు.**
- **ఈత నేర్చుకున్న విద్యార్థులకు ఏదైనా ఒక సబ్జెక్ట్‌లో 2 మార్కులు చేర్చేవిధంగా..**
- **పర్యావరణ ప్రేమికుడు సామాజిక వేత్త కోలా రవిందర్ ముదిరాజ్ ఆర్డీవోకి విజ్ఞప్తి..**



**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, ఏప్రిల్ 10:**కేంద్ర,రాష్ట్ర విద్యాశాఖలు ఈత ఒక సాధనంగా గుర్తించి, పాఠ్యాంశంగా చేర్చాలని మల్కాజిగిరి ఆర్డీవో శ్యామ్‌ప్రకాష్‌కు సామాజిక వేత్త రవిందర్ ముదిరాజ్ వినతిపత్రం అందజేశారు.. సామాజిక కార్యకర్త ,పర్యావరణ ప్రేమికుడు రవీందర్ ముదిరాజ్ మాట్లాడుతూ. ఈత ఒక సాధనమని తెలియక ముఖ్యంగా, వేసవి సెలవుల్లో వందలాది మంది విద్యార్థులు బావుల్లో చెరువుల్లో, కాలువల్లో, ఈతకు వెళ్ళి మృత్యువాత పడుతున్నారని రవిందర్ ఆవేదన వ్యక్తం చేశారు.. పాఠ్యాంశంలో చేర్చి విద్యార్థులకు ఈత కూడ నేర్పించినట్లైతే..! ఏదైనా ఒక సబ్జెక్ట్‌లో 2 మార్కులు కలిపే విధంగా ప్రభుత్వ జి.ఓ వచ్చే విదంగా ప్రయత్నించాలని, ఆర్డీవోను కోరడం జరిగిందని అన్నారు.. వేసవి సెలవుల్లో ఎంతోమంది విద్యార్థులు గ్రామాలకు వెళ్లి చనిపోయే ప్రమాదం ఉందని..! కావున రాష్ట్ర ప్రభుత్వానికి తెలియపరిచి, రాష్ట్రవ్యాప్తంగా సుమారు 700 మంది విద్యార్థులు చనిపోయినట్లుగా రికార్డులు చెబుతున్నాయి.. కావున అధికారులు శ్రద్ధ వహించి, ప్రభుత్వానికి తన విన్నపాన్ని చేరుస్తారని, ఆర్డీవో శ్యామ్‌ప్రకాష్‌ను కోరారు.. రవిందర్ ముదిరాజ్ విజ్ఞప్తికి స్పందించిన మల్కాజిగిరి ఆర్డీవో శ్యామ్‌ప్రకాష్, ఇది చాలా మంచి విషయమని తెలిపారు..ఈ ఈత ఒక సాధనం విషయాన్ని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తానని తెలిపారు.. ప్రభుత్వ ఉద్యోగం సంపాదించాలంటే ఈత తప్పని సరిగా ఆదేశాలు జారీ చేస్తే ప్రతి ఒక్కరూ ఈత నేర్చుకొంటారని రవిందర్ ముదిరాజ్ కోరారు..

# హైదరాబాద్‌లో కాపర్ రీసైక్లింగ్ యూనిట్‌లో అగ్ని ప్రమాదం

**హైదరాబాద్ పెన్ పవర్:**హైదరాబాద్ నగరంలోని ప్రశాంతినగర్‌లో ఓ కాపర్ రీసైక్లింగ్ యూనిట్‌లో అగ్నిప్రమాదం సంభవించింది. ఈ దుర్ఘటనలో సుమారు రూ. 1 కోటి విలువైన కాపర్ తుక్కు పూర్తిగా దగ్ధమైంది. కాపర్ రీసైక్లింగ్ యూనిట్ నుంచి ఒక్కసారిగా మంటలు ఎగిసిపడుతుండటాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు.

వెంటనే స్పందించిన అగ్నిమాపక సిబ్బంది మూడు ఫైరింజన్లు, పది వాటర్ ట్యాంకర్ల సహాయంతో మంటలను అదుపులోకి తెచ్చారు. అధికారులు తక్షణమే స్పందించడంతో భారీ ప్రమాదం తప్పిందని స్థానికులు పేర్కొంటున్నారు.

ఈ ప్రమాదం కారణంగా పక్కనే ఉన్న డాకస్ సీ కంపెనీలో దాదాపు కోటి రూపాయల విలువైన ముడి సరుకు, యంత్ర పరికరాలు దెబ్బతిన్నాయని ఆ కంపెనీ యాజమాన్యం వెల్లడించింది.

# పెద్దపల్లి జిల్లాలో విషాదం... బిడ్డకు ఉరేసి తల్లి ఆత్మహత్య

**పెద్దపల్లి పెన్ పవర్:** పెద్దపల్లిలో దారుణం చోటుచేసుకుంది. ఏడాదిన్నర పాపకు ఉరేసి తల్లి ఆత్మహత్యకు పాల్పడింది. కారణం స్పష్టంగా తెలియకపోయినప్పటికి పసిపాపకు ఉరేసి తల్లి ఆత్మహత్య చేసుకోవడం కలకలం సృష్టిస్తుంది. పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండల కేంద్రానికి చెందిన లోక వేణుగోపాల్ రెడ్డికి అయిదేళ్ల కిందట కరీంనగర్ జిల్లా రామడుగు మండలం వెదిరకు చెందిన సాహితితో వివాహం అయ్యింది. వారికి ఏడాదిన్న వయసున్న కూతురు రీతిన్య ఉంది. పెద్దపల్లి ఎల్ఐసి కార్యాలయంలో ఉద్యోగం చేస్తున్న వేణుగోపాల్ నిన్న జగిత్యాలకు వెళ్ళారు. రాత్రి ఇంటికి వచ్చేసరికి కూతురు రీతిన్య, భార్య సాహితి విగతజీవులుగా పడి ఉన్నారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో రాత్రి తల్లికూతురు మృతదేహాలను పెద్దపల్లి ఆసుపత్రిలోని మార్చురికి తరలించారు. సాహితి మానసిక స్థితి సరిగా లేక గత కొంతకాలంగా ఇబ్బందిపడుతుందని అందులో బాగంగానే బిడ్డకు ఊపిరి ఆడకుండా చేసి తాను ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు బావిస్తున్నారు. సంఘటన స్థలాన్ని సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్సై లక్ష్మణ్ రావు సందర్శించి కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

# రెండు ఎకరాల భూ వివాదం..

**భద్రాద్రి కొత్తగూడెం పెన్ పవర్:** అశ్వాపురం మండలం లోని రామచంద్రా పురం గ్రామం లో 2 ఎకరాల భూ వివాదం పై సారపాక టి.యన్. టి.యూ.సి నాయకులు హరి ప్రసాద్ అనుచరులపై , అతని కార్ పై కాంగ్రెస్ వర్గీయులు దాడి చేశారు.. విషయం తెలుసుకున్న అశ్వాపురం సి.ఐ అశోక్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని అడ్డుకోబోయారు. ఈ ఘర్షణ లో సి.ఐ గన్ మెన్ రమేష్ పై కూడా కాంగ్రెస్ వర్గీయులు దాడి చేశారు.. ఈ సందర్భంగా టి.ఎన్. టి.యూ.సి నాయకుడు కనక మెడల హరి ప్రసాద్ మాట్లాడుతూ.. అశ్వాపురం రెవిన్యూ పరిధి లోని రామచంద్రా పురం గ్రామంలో మాకు 41ఎకరాల 17 గుంటలు కలదు అందులో 2 ఎకరాల భూమి పై కొన్ని సంవత్సరాలుగా వివాదం జరుగుతుంది.. ఈ నేపథ్యంలో ఇటీవల హై కోర్టు నుండి ఆర్డర్ కాపీ తెచ్చుకుని 2 ఎకరాల చుట్టూ ఫెన్సింగ్ వేయటానికి స్థలం వద్దకు చేరుకోగా కొంతమంది కాంగ్రెస్ వర్గీయులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి అతని అనుచరులు దాడి కి దిగారు.. జె.సి.బి పై, నా కార్ పై దాడి చేశారు. అడ్డుకోబోయిన అశ్వాపురం సి.ఐ గన్ మెన్ పై కూడా దాడి చేశారు.. తమ దాడి చేసిన వారి పై అశ్వాపురం పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేశానని, మా పై దాడి చేసిన వారి పై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు..

# అక్రమ కాలేజీలపై చర్యలు తీసుకోవాలి

**హైదరాబాద్: పెన్ పవర్:**బోర్డు నిబంధనలను ఉల్లంఘిస్తున్న అక్రమ ఇంటర్మీడియట్ కాలేజీలపై వెంటనే చర్యలు తీసుకోవాలని..తెలంగాణ స్టేట్ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కమిషన్ కు బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్,విద్యార్థి నాయకులు పిర్యాదు చేసారు. ఇంటర్మీడియట్ కళాశాలలు బోర్డు నుండి సరైన అనుమతి లేకుండా అనేక కళాశాలలు పనిచేస్తున్నాయి. ఈ సంస్థలు బోర్డు నిర్దేశించిన ప్రాథమిక నిబంధనలను ఉల్లంఘించడమే కాకుండా ఎలాంటి నియంత్రణ లేకుండా విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. వేసవి సెలవులకు సంబంధించి ఇంటర్మీడియట్ బోర్డు నుండి స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ,కాలేజీలో చాలా మంది వేసవిలో అనధికార తరగతులను కొనసాగిస్తూనే ఉన్నారని అన్నారు.

ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించి విద్యార్థులపై అనవసరమైన విద్యా మానసిక ఒత్తిడిని కలిగిస్తున్నారు. విద్యార్థులను,తల్లిదండ్రులను దోపిడీ చేయడమే కాకుండా మన రాష్ట్రంలో విద్యావ్యవస్థ సమగ్రతను దెబ్బతీస్తున్నాయి. అఫిలియేషన్, అనుమతి లేకుండా నిర్వహిస్తున్న అన్ని కళాశాలలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పారదర్శక విద్యా వ్యవస్థను నిర్ధారించడంలో బోర్డు తన బాధ్యతను నిలబెట్టుకోవాలని కోరారు.

# అమూల్ కార్యాలయాన్ని సందర్శించిన మంత్రి పొన్నం

**అహ్మదాబాద్: పెన్ పవర్:**గుజరాత్ లోని అమూల్ డెయిరీ ప్రధాన కార్యాలయాన్ని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి,ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి గురువారం సందర్శించారు. శ్వేత విప్లవ పితామహుడు వర్గీస్ కురియన్ ,అమూల్ డెయిరీ వ్యవస్థకులు త్రిభువన్ వందాస్ కె పటేల్ విగ్రహాలకు నివాళులు అర్పించారు. అమూల్ ఉత్పత్తి తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు.. వర్గీస్ కురియన్ వీడియో గ్రఫిని వీక్షించారు..




# కేయూలో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఆందోళన

**వరంగల్ : పెన్ పవర్:**వరంగల్ జిల్లాలో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఆందోళనకు దిగారు. గురువారం నాడు కేయూ యూనివర్సిటీ బంద్ కు కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు పిలుపునిచ్చారు. కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు విధులు బహిష్కరించి ఆందోళన చేసారు. జీవో 21 రద్దు చేయాలాని డిమాండ్ చేసారు. తమను రెగ్యులరైజ్ చేసినాకే కొత్త రిక్రూట్మెంట్లు చేయాలని కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు అన్నారు.

## రాష్ట్రంలో పకడ్బందీగా భూసర్వే

**అమరావతి: పెన్ పవర్:**జాతీయ సర్వే దినోత్సవం సందర్భంగా భూయజమానులకు, సర్వే శాఖ ఉద్యోగులకు రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ శు భాకాంక్షలు తెలిపారు.

మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో రీ సర్వే ప్రతిష్ఠాత్మకంగా సాగుతోంది. ఈ సర్వేలో పాల్గొంటున్న ఉద్యోగులు, అధికారులకు నా అభినందనలు. రైతులు, భూ యజమానుల హక్కులను రక్షించేవిధంగా పొలం గట్ల పైన తిరుగుతూ సర్వే ఉద్యోగులు కష్టపడుతున్నారు. గత ప్రభుత్వం రీ సర్వేను భ్రష్టు పట్టించింది. తప్పుల తడకగా నిర్వహించింది. మా ప్రభుత్వం ఆ తప్పులను సరి చేస్తోంది. రీ సర్వేను ఎంతో పకడ్బందీగా చేస్తున్నాం. అందులో సర్వే శాఖ ఉద్యోగులు కూడా కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు.

## మిర్యాలగూడ గాంధీ నగర్ లో పోలీసుల కార్డెన్ అండ్ సెర్చ్

**నల్గొండ: పెన్ పవర్:**మిర్యాలగూడ పట్టణం గాంధీనగర్ లో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. డీఎస్పీ రాజశేఖర్ రాజ్ ఆధ్వర్యంలో ఇద్దరు సీఐలు ,8 మంది ఎస్ఐలు,75 మంది పోలీస్ సిబ్బందితో సోదాలు జరిపారు. సరైన పత్రాలు లేని 56 బైకులు, నాలుగు ఆటోలు స్వాధీనం చేసుకున్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవంటూ డీఎస్పి హెచ్చరించారు. కార్డెన్ సెర్చ్ లు ఇంకా మిర్యాలగూడ డివిజన్ లో నిర్వహిస్తామన్నారు.

## ఎస్బీఐ ఏటీఎంలో చోరీ

## 12 లక్షల నగదు ఎత్తుకెళ్లిన దొంగలు

**యాదాద్రి.. పెన్ పవర్:**యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం లింగోజిగూడెం శివారులో గల దివిస్ కంపెనీ పక్కనే ఉన్న ఎస్బిఐ ఏటిఎం లో దొంగలు బీభత్సం సృష్టించారు... ఏటీఎంలో ఉన్న సుమారు 12 లక్షల 50 వేల రూపాయలు ఎత్తుకెళ్లారు దుండగులు.

ఏటీఎం మిషన్ ను పగలగొట్టి డబ్బులు ఎత్తుకెళ్లినట్టుగా గుర్తించిన పోలీసులు.. దొంగతనం చేసిన తర్వాత ఏటీఎం షట్టర్ ను ఎవరికి అనుమానం రాకుండా కిందకు వేసి అక్కడినుండి దొంగలు పరారయ్యారు.

ఘటన స్థలానికి వెంటనే యాదాద్రి జిల్లా డీసీపీ అక్షాన్ష్ యాదవ్,రాచకొండ క్రైం డీసీపీ బి అరవింద్, చౌటుప్పల్ ఏసిపి మధుసూదన్ రెడ్డిలు వారి సిబ్బందితో కలిసి క్లూస్ టీం ద్వారా వేలిముద్రలు సేకరిస్తున్నారు.. సిసి కెమెరా ఫుటేజ్ లు కూడా సేకరించే పనిలో ఉన్నారు.

నిత్యం రద్దీగా ఉండే హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారి 65 పక్కనే ఉన్న ఈ ఏటీఎం లో దొంగలు బీభత్సం సృష్టించి డబ్బులు ఎత్తుకెళ్లడం పోలీసులకు సవాల్ గా మారిందని చెప్పవచ్చు....

## రెల్లి కులాలకు ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలి

**విజయనగరం: పెన్ పవర్:**విజయనగరం జిల్లా గజపతినగరం లో ఏపీలోని రెల్లి ఉపకులాలకు ఎస్.సిలో ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు సోము మురళీమోహన్ డిమాండ్ చేశారు. రెల్లి కులస్తుల కు న్యాయం చేయాలని కోరుతూ నిరసన దీక్ష చేపట్టడంతోపాటు ర్యాలీ నిర్వహించారు. అనంతరం నాలుగు రోడ్ల కూడలిలో మానవ హారంగా ఏర్పడ్డారు. ఈ నిరసనలో రెల్లి ఉపకులాల గజపతినగరం నియోజకవర్గ అధ్యక్షులు గంధ్రేటి రామారావు పాల్గొన్నారు. నియో జకవర్గ లోని అన్ని మండలాల నుంచి రెల్లి కులస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం లోసేవలను పరిశీలించిన మేడ్చల్ - మల్కాజిగిరి కలెక్టర్.

**హైదరాబాద్ పెన్ పవర్:**గురువారం నుండి స్లాట్ బుకింగ్ విధానం మొదలైన నేపథ్యంలో కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సేవలను పర్యవేక్షించిన మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ పొట్రూ.తెలంగాణ రాష్ట్రం లో ఈ రోజు నుండి సబ్ రిజిస్టర్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ ద్వారా రిజి స్ట్రేషన్లు చేసుకునే కార్యక్రమం అమల్లోకి వచ్చింది.

రాష్ట్రం లోని 22 సబ్ రిజిస్టర్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని పైలట్ ప్రాతిపదికన అమలు చేసారు.

రిజిస్ట్రేషన్ లావాదేవీల రద్దీని తగ్గించేలా ఒక్క రోజులో పనివేళలను 48 నలభై ఎనిమిది స్లాట్లుగా విభజించారు..

కుత్బుల్లాపూర్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రద్దీ దృష్టా అదనంగా ఇద్దరు అనగా 3 ముగ్గురు రిజిస్టర్ లు విధులను నిర్వహిస్తూ తలా 48 స్లాట్లు మొత్తం 144 రిజిస్ట్రేషన్ చేస్తారు.

క్రయవిక్రయదారులు తమ అనుకూల మైన తేదీ, సమయంలో స్లాట్ బుక్ చేసుకునే అవకాశం కల్పించారు.

సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలలో స్లాట్ బుకింగ్ విధా నాన్ని అమల్లోకి తేవడం ద్వారా ప్రజలు గంటలకొద్దీ నిరీక్షించకుండా 10-15 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ పూర్తి అవుతుంది..

ఈ కార్యక్రమం లో కలెక్టర్ తో పాటు జిల్లా రిజిస్టర్, మండల రెవెన్యూ అధికారులు,, తదితరులు పాల్గొన్నారు

## సబర్మతి నదిని పరిశీలించిన మంత్రి పొన్నం, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, సీఎం ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి

**హైదరాబాద్ పెన్ పవర్:** మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, సీఎం ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, స్థానిక అధికారుల తో కలిసి సబర్మతి నదిని పరిశీలించారు. సబర్మతి మాదిరి మూసి అభివృద్ధి కి చేసే అంశాలను అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే పార్టీలకు అతీతంగా జీహెచ్ఎంసీ మేయర్, హైదరాబాద్ లో ఉన్న 150 మంది కార్పొరేటర్లు సబర్మతి స్టడీ టూర్ చేస్ఆరిని అన్నారు. సబర్మతి నది మాదిరి మూసి పునరాభివృద్ధికి ఫేజ్ -1 కింద బాపు ఘాట్ వరకు చేసే అభివృద్ధి పై స్టడీ టూర్ ద్వారా జిహెచ్ఎంసి బృందం పరిశీలించనుంది.

## యాదాద్రి జిల్లా లో ఇస్రో పరికరాల తయారీ.

**హైదరాబాద్ పెన్ పవర్:** యాదాద్రి భువనగిరి జిల్లా నుంచి జీఎస్ఎల్వీ రాకెట్లో విని యోగించేందుకు అవసరమైన 'ఎకోథెర్మ్ ఫినోలిక్ ఫోమ్ ప్యాడ్లు బీబీనగర్ మండలం నుంచి తిరువనంతపురంలోని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ (వీఎస్ఎస్సీ)కు తరలించారు. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) త్వరలో ప్రయోగించనున్న జీఎస్ఎల్వీ రాకెట్ లో వీటిని వినియోగించనున్నారు. బీబీనగర్ మండలంలోని జెమ్మిలాపేట్ లోని వీఎన్డిసెల్ ప్లాస్ట్ కంపెనీలో నిర్వహించిన కార్యక్రమంలో వర్చువల్ విధానంలో వీఎస్ఎస్సి డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఉన్నికృష్ణన్ నాయర్ ఫ్లాగ్ ఆఫ్ చేశారు. తిరువనంతపురంలోని వీఎస్ఎస్సీ నుంచి శాస్త్రవేత్తలు డాక్టర్ ఏఎం. నల్ల పెరుమాల్, డాక్టర్ సురేష్ కుమార్ తోపాటు మొత్తం 13 మంది వర్చువల్ ఫ్లాగ్ ఆఫ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇస్రోతో ఒప్పందం మేరకు ఒక రాకెట్ కు వినియోగించనున్న 365 'ఏకో థెర్మ్ ఫినోలిక్ ఫోమ్ ప్యాడ్లను కంటైనర్ల ద్వారా తరలించారు. ఈ సందర్భంగా వీఎన్డీ సెల్ స్టార్ట్ కంపెనీ డైరెక్టర్లు డి.చంద్రశేఖర్ రెడ్డి, ఎస్.సుఖ్వన్ రెడ్డి, కే.ఎస్.చౌదరి పూజలు నిర్వహించారు.

# యంగ్ ఇండియా పోలీసు స్కూల్ అత్యంత ముఖ్యమైనది



**హైదరాబాద్ ఏప్రిల్ 10 పెన్ పవర్:** మంచిరేవులలో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ విద్యాసంస్థ ప్రారంభోత్సవ శిలాఫలకాన్నిసిఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. తదుపరి రంగారెడ్డి జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటించారు. మంత్రి శ్రీధర్ బాబు, పోలీస్ ఉన్నతాధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. తరగతి గదులను సిఎం రేవంత్ రెడ్డి పరిశీలించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ..పోలీసులకు యంగ్ ఇండియా పోలీసు స్కూల్ అత్యంత ముఖ్యమైనదని తెలిపారు. పోలీసుశాఖపై తమకు స్పష్టమైన ఆలోచన ఉందని అన్నారు.కొందరు ఉద్యమ నేతలం, తెలంగాణ ప్రదాతలమని అనుకుంటున్నారని చెప్పారు. యంగ్ ఇండియా అనేది తన బ్రాండ్ అని తెలియజేశారు.16 నెలలైన బ్రాండ్ ఎందుకు సృష్టించుకోలేదని కొందరు అడిగారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ గురుకులాల్లో కనీస వసతులు కూడా లేవని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ భవిష్యత్తు తరగతి గదిలో ఉందని, యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ కు నిధులు సమకూర్చుకోవాలని వెల్లడించారు. రూ. 100 కోట్లతో కార్పస్ ఫండ్ ను సమకూర్చుకోవాలని కోరారు. నిధుల విషయంలో ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. యంగ్ ఇండియాలో భాగంగా చదువు, ఉపాధే తమ బ్రాండ్ అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు

# మార్గదర్శకాలు ప్రామాణికంగా విభజన జరుగాలి



**జయశంకర్ భూపాలపల్లి: పెన్ పవర్:**సహకార సంఘ మార్గదర్శకాలు ప్రామాణికంగా సహకార సంఘాల పునర్విభజన చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. గురువారం ఐడిఓసి కార్యాలయంలో సహకార సంఘాలు పునర్విభజనపై రెవెన్యూ, సహకార, వ్యవసాయ, ఉద్యాన, మత్స్య, పశు సంవర్ధక, వరంగల్, కరీంనగర్ డిసిసిబి డిజిఎం, ఎజిఎంలతో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సహకార సంఘం మార్గదర్శకాల. మేరకు 10 అంశాలను పరిగణనలోకి తీసుకుని10 నూతన సహకార సంఘాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపనున్నట్లు తెలిపారు. సహకార సంఘాలు ఏర్పాటు ద్వారా అన్ని గ్రామాల రైతులకు ప్రయోజనం కలగాలని తెలిపారు. ప్రస్తుతం ఉన్న సహకార సంఘాలు సుదూరం ఉన్నందున ప్రజలకు సేవలు అందించడానికి ఇబ్బందులు వస్తున్నాయని, అట్టి ఇబ్బందులు గమనంలోకి తీసుకుని నూతన సహకార సంఘాలు ఏర్పాటు చేయుటకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. నూతన సంఘాలు ఏర్పాటులో మూడు సంవత్సరాలు పాటు జరిగిన వ్యాపార లావాదేవీలు, ఆడిట్ నివేదికతో పాటు 9 అంశాలను తు.చ. తప్పక పరిగణలోకి తీసుకోవాలని ఆయన జిల్లా కలెక్టర్ సూచించారు. సహకార సంఘాలు ఏర్పాటు ద్వారా రైతులకు ఇన్ పుట్ సబ్సిడీలు అందించి రైతుల ఆర్థికాభివృద్ధికి సహకారాన్ని అందించేందుకు బహుళ ప్రయోజన సహకార సంఘాలు ఏర్పాటు అవశ్యత అవసరమని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, సహకార శాఖ అధికారి వాల్యానాయక్, పశుసంవర్ధక శాఖ అధికారి డా కుమారస్వామి, వ్యవసాయ శాఖ ఎడిఏ బాపు, ఉద్యాన అధికారి సునీల్, మత్స్య శాఖ అధికారి విజయ్ కుమార్, నాబార్డు డిడిఎం చైతన్యరవి, కరీంనగర్, వరంగల్ డిసిసిబి సీఈఓలు సత్యప్రసాద్, వజీర్ సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## వినియోగంలోకి వచ్చిన జిల్లా పోలీసు సాయుధ దళ నూతన కార్యాలయ భవనం

**వనపర్తి పెన్ పవర్::**జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ చొరవతో నిర్మాణం మధ్యలోనే ఆగిపోయిన జిల్లా పోలీసు సాయుధ దళ కార్యాలయ భవనం పని పూర్తి చేసుకొని వినియోగంలోకి వచ్చింది.

నేపథ్యంలోకి వెళితే కొత్త జిల్లాలు ప్రారంభమైనప్పటి నుండి సాయుధ దళ కార్యాలయాన్ని వనపర్తి రెడ్డి సేవా సమితి సంఘ భవనంలో తాతకాలికంగా ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రతి నెల 88 వేలు అద్దె చెల్లించడంతో పాటు సాయుధ పోలీసులు విధులు నిర్వహించేందుకు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ కి తెలిసింది.

నూతన పోలీసు సాయుధ దళ భవనం నిర్మాణం అసంపూర్తిగా ఉన్న విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ప్రత్యేక చొరవ తీసుకొని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తో చర్చించారు. కలెక్టర్ నిధులనుండి 10 లక్షల రూపాయలు మరియు పెబ్బేరు షుగర్ ఫ్యాక్టరీ 2లక్షల 50వేల రూపాయల సహకారంతో సాయుధ దళ కార్యాలయ నూతన భవనం యొక్క మిగతా నిర్మాణం పూర్తి చేయించారు. అత్యాధునిక హంగులతో ఆహ్లాదకరమైన వాతావరణంలో విశాలమైన నూతన భవనాన్ని అందుబాటులోకి తీసుకొచ్చి సాయుధ పోలీసు అధికారులకు,సిబ్బందికి కానుకగా ఏప్రిల్ నెల 4వ తేదీన తెలంగాణ రాష్ట్ర డిజిపి "డా" జితేందర్ తో ప్రారంభింపజేశారు. ఈ సందర్భంగా గురువారం రోజు పోలీసు సాయిధ దళ కార్యాలయ అధికారులు, సిబ్బంది పోలీసు సాయిధ దళ కార్యాలయాన్ని అందుబాటులోకి తీసుకురావడానికి ప్రత్యేక చొరవతో చూపిన జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ కి పోలీసు అధికారులు, పోలీసు సిబ్బంది, హోమ్ గార్డ్ సిబ్బంది, తమ సంతోషం వ్యక్తం చేస్తూ ఎస్పీ ని శాలువాతో సన్మానించారు. ఎస్పీ సన్మాన కార్యక్రమంలో జిల్లా పోలీసు సాయుధ దళ అదనపు ఎస్పి, వీరారెడ్డి, వనపర్తి జిల్లా ఇన్చార్జ్ అదనపు ఎస్పీ, ఉమామహేశ్వరరావు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, శ్రీనివాస్, అప్పలనాయుడు, స్పెషల్ బ్రాంచ్ సీఐ, నరేష్, పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గులాబీ దండు కదం తొక్కాలి...ఓరుగల్లు దద్దరిల్లాలి...

**హైదరాబాద్ పెన్ పవర్:**గులాబీ దండు కదం తొక్కాలి...ఓరుగల్లు దద్దరిల్లాలి... కాంగ్రెసోళ్ల గుండెల్లో రైళ్లు పరిగెత్తాలి... 25 వసంతాల గులాబీ జాతరను విజయవంతం చేయాలని రామగుండం మాజీ శాసనసభ్యులు పెద్దపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ పిలుపునిచ్చారు.




వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభ సందర్భంగా బుధవారం రాత్రి గోదావరిఖని పట్టణంలోని లక్ష్మీ ఫంక్షన్ హాల్లో రామగుండం నియోజకవర్గం పార్టీ ముఖ్యనేతలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్నో అవమానాలు...
మరెన్నో అవహేళనలు...
అన్నిటినీ అధిగమించి... తొలి సిఎం కేసీఆర్ నాయకత్వం లో
**స్వరాష్ట్రాన్ని సాధించి...**
4 కోట్ల తెలంగాణ ప్రజల కలను సాకారం చేసి. సగర్వంగా నిలిపింది గులాబీ జెండా అన్నారు. బీఆర్ఎస్ పార్టీని కేసీఆర్ స్థాపించి, ప్రజలను కదిలించి ఉద్యమం చేయకుంటే తెలంగాణ వచ్చేది కాదన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చెప్పిన అబద్ధాలను నమ్మి ప్రజలు అధికారం ఇచ్చారని, కానీ వచ్చిన అవకాశాన్ని ఆ పార్టీ నాయకులు సద్వినియోగం చేసుకోక ఆగమాగం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ప్రజలను కంటికి రెప్పలా కాపాడిందని, అధికారం కోల్పోయినా ప్రజల వెంటనే ఉంటోందని, తమకు ఓట్లు వేయలేదని ప్రజ లను ఏనాడు పట్టించుకోకుండా ఉండలేదన్నారు. కేసీ ఆర్, బీఆర్ఎస్ ఒక్కటే ఈ రాష్ట్ర ప్రజలకు రక్షణగా ఉంటుందని స్పష్టం చేశారు. భారత రాష్ట్ర సమితి 25 వ సంవత్సరంలో అడుగెడుతున్న సందర్భంగా రజతోత్సవ వేడుకల్లో భారీ బహిరంగ సభకి.. రామగుండం నియోజకవర్గం లో ఉన్నటువంటి బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రతి ఒక్కరు కూడా వేలాదిగా తరలి వెళ్లాలి.
రేవంత్ రెడ్డి పాలన ఫెయిల్ అయిందని .. హైడ్రా పేరుతో పేద ప్రజల జీవితాలు నాశనం చేశారు.. భూముల అమ్మకాల పేరుతో మూగ జీవాల గోస పెడుతున్నారని మూగ జీవాలు గొస రేవంత్ రెడ్డిని తగులుతుందన్నారు.
రుణమాఫీ చేస్తా అని సగం రుణమాఫీ చేసి చేతులు దులుపుకున్నారన్నారు.
కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చినటువంటి హామీలను అమలు చేయాలని స్థానిక కాంగ్రెస్ పార్టీని నిలదీస్తే నాపైన, మా పార్టీ నాయకుల పైన 12 కేసులు పెట్టించారన్నారు. ఎన్ని కేసులు పెట్టిన, ఎన్ని ఇబ్బందులు పెట్టిన ప్రజల కోసం పోరాడుతూనే ఉంటామన్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన కుంటుపడిపోయింది. పూర్తిగా గాడి తప్పింది. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడుస్తున్నా ప్రజలకు చేసిందేమీలేదు. పాలనపై ప్రజలు అయోమయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. కాంగ్రెస్ చెప్పిన అబద్ధాలను నమ్మి తాము మోస పోయామని భావిస్తున్నారు. ప్రభుత్వంపై రోజురోజుకూ ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతున్నది. ప్రజలు మళ్లీ కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారు. ఈ నెల 27న మన ఇంటి పార్టీ పండుగకు స్వచ్ఛందంగా తరలుదాం.. విజయవంతం చేద్దామని ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు కౌశిక హరి నడిపెల్లి మురళీధర్ రావు పెంట రాజేష్ జె.వి. రాజు గోపు అయులయ్య పాముకుంట్ల భాస్కర్ రమణారెడ్డి కల్వచర్ల కృష్ణ వేణి రాకం వేణు కుమ్మరి శ్రీనివాస్ జనగాన కవిత సరోజినీ అచ్చే వేణు నూతి తిరుపతి చెలకలపల్లి శ్రీనివాస్ మేడి సదానందం జక్కుల తిరుపతి మేతుకు దేవరాజ్ ముద్దసాని సంధ్యా రెడ్డి గుంపుల లక్ష్మి సట్టు శ్రీనివాస్ బుర్ర వెంకన్న రామరాజు నీరటి శ్రీనివాస్ ఇరుగురాళ్ల శ్రావన్ కొడి రామకృష్ణ చింటూ ఆవునూరి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

# అంగన్వాడీ సూపర్ వైజర్లకు స్కూటీల పంపిణి




**జయశంకర్ భూపాలపల్లి పెన్ పవర్:** మారుమూల ప్రాంతాల్లో అంగన్ వాడి సిబ్బంది సేవలకు, రైతులకు ఉపయోగపడే డ్రోన్లు, వైద్య సేవల పరికరాలు జిల్లా ప్రజలకు ఎంతగానో ఉపయోగ పడతాయని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. గురువారం ఐడిఓసి కార్యాలయంలో ఈసీఐఎల్ కంపెనీ సిఎస్ఆర్ నిధులు నుండి 20 ఎలక్ట్రానిక్ స్కూటీలు, 12 డ్రోన్ల పంపిణీ చేశారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్ వాడి సూపర్ వైజర్లు మారుమూల గ్రామాల్లో.సేవలు అందించడానికి, వ్యవసాయంలో డ్రోన్లు వినియోగం, వైద్య సేవలు సిటీ స్కాన్, ఇతర పరికరాలు ఈసిఐఎల్ సి ఎస్ ఆర్ నిధులు ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మారుమూల ప్రాంతాలకు అంగన్వాడి సూపర్ వైజర్లు వెళ్లడానికి రవాణా సౌకర్యాలు లేవని ఎలక్ట్రానిక్ స్కూటీలు కుగ్రామానికి సైతం సులువుగా వెళ్ళడానికి ఉపయోగ పడతాయని తెలిపారు. ఈ రోజుల్లో వ్యవసాయ పనులకు కూలీలు కొరత ఉందని, ఈ ఆధునిక సాంకేతికత డ్రోన్లు వినియోగం రైతులకు చాలా ఉపయోగమని అన్నారు. రసాయన మందులు పిచికారీ సమయంలో ప్రజలు ప్రాణాలకు అపాయం ఏర్పడుతుందని, డ్రోన్లు వినియోగం ద్వారా ప్రాణాలకు ఎలాంటి అపాయం ఏర్పడదని, సమయం కూడా ఆదా అవుతుందని తెలిపారు. అలాగే జిల్లా ప్రధాన ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలకు సిటీ స్కాన్ ఇతర పరికరాలు ఇవ్వనున్నారని తెలిపారు. రానున్న నెల రోజుల్లో వైద్య పరికరాలు ఏర్పాటు జరుగుతుందిని తెలిపారు. ఈసిఐఎల్ సి అండ్ ఎండి అనురాగ్ కుమార్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ స్కూటీ లు, డ్రోన్లు, వైద్య పరికరాలు మొత్తం 4 కోట్ల సి ఎస్ ఆర్ నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. స్కూటీలు, డ్రోన్లు వినియోగం వల్ల అంగన్వాడీ సేవలకు, రైతులకు ఉపయోగకరమని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, సీపీఓ బాబు రావు, సంక్షేమ అధికారి మల్లీశ్వరి, వ్యవసాయ అధికారి వీరు నాయక్, ఆసుపత్రి పర్య వేక్షకులు డా నవీన్ కుమార్, ఈసిఐఎల్ హెచ్ ఆర్ ఈడీ మురళీధర్, సీఎంఓ వేణుబాబు తదితరులు పాల్గొన్నారు.

# కారంపూడి గ్రామ వ్యాపారి ఖాతాపై సైబర్ నేరగాళ్ల పంజా 55 వేలు స్వాహా

**పల్నాడు:** పెన్ పవర్:కారంపూడికి చెందిన పొగాకు వ్యాపారి ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు బుధవారం రాత్రి రూ. 55 వేలు స్వాహా చేశారు. బాధిత వ్యాపారికి సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి, ఎస్బీఐ బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని, మీ క్రెడిట్ కార్డు వాడకంలో లేనందున బ్లాక్ చేస్తున్నట్లు చెప్పారు. వారి మాటలు నమ్మి ఓటీపీ, కార్డు నెంబర్లను సైబర్ నేరగాళ్లకు అందించాడు. తన బ్యాంకు ఖాతా నుంచి 55 వేలు డ్రా అయినట్లు మొబైల్ కు మెసేజ్ రావడంతో మోసాన్ని గుర్తించాడు...

# మహిళ సెల్ఫీ ఆత్మహత్యయత్నం

**నిజామాబాద్ పెన్ పవర్:**
ఇందల్వాయి మండలం తిర్మాన్ పల్లి లో సెల్ఫీ వీడియో కలకలం రేపింది. తన వ్యవసాయ భూమి కొనుగోలు చేసిన వ్యక్తి డబ్బులు ఇవ్వకపోవడం పై వివాదం చెలరేగింది. డబ్బులు చెల్లించకుండా తనపై దాడి చేశారంటూ బాధితురాలు సంధ్యరాణి పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నం చేసింది. సెల్ఫీ వీడియో ను సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది బాధితురాలు సంధ్య. ఆమెను స్థానికులు ఆసుపత్రికి తరలించారు.

# ఆర్టీసీ బస్సు, ఆటో ఢీ..

# ఆటోలో జిలెటిన్ స్టిక్స్ గుర్తింపు

**కరీంనగర్:** పెన్ పవర్:గంగాధర మండలం మధురానగర్ సమీపంలో ఆర్టీసీ బస్సు, ఆటో ఢీకొన్నాయి. ఘటన కారణంగా ఆటోలో అక్రమంగా తరలిస్తున్నజిలిటిన్ స్టిక్స్ బయటపడ్డాయి. మధురానగర్ ఎత్తుబోడ వద్ద కరీంనగర్ నుంచి జగిత్యాల వైపు ఆర్టీసీ బస్సు వెళ్తుంది. జగిత్యాల నుంచి కరీంనగర్ వైపు వస్తున్న ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో బోల్తాపడగా ఆటోలో నుంచి రెండు కాటన్ బాక్సుల్లో జిలిటిన్ స్టిక్స్ బయటపడ్డాయి. రెండు కాటన్ బాక్స్ లను మురికి కాలువలో పడేసి ఆటో డ్రైవర్ పారిపోయాడు. పోలీసులు జిలిటిన్ స్టిక్స్ ను స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టారు. బస్సు ప్రయాణికులు మాత్రం తృటిలో పెను ప్రమాదం తప్పిందని ఊపిరి పీల్చుకున్నారు.

# సుప్రీం కమిటీని కలిసిన బీఆర్ఎస్ బృందం

**హైదరాబాద్:**
**పెన్ పవర్:**సుప్రీం కోర్టు పరిధిలోని సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ తో తాజ్ కృష్ణా హోటల్ మాజీ మంత్రి హరీష్ రావు నేతృత్వంలోని బృందం భేటి



అయింది. కంచె గచ్చిబౌలి భూముల్లో క్షేత్రస్థాయి పరిశీలన, వాస్తవ పరిస్థితుల పై కమిటీ కి నివేదిక బీఆర్ఎస్ పార్టీ బృందం సమర్పించింది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ లో వాస్తవాలను కమిటీకి వివరించింది. బృందంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్,ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, బీఆర్ఎస్ నేతలు దేవిప్రసాద్,ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తదితరులున్నారు. .

## మృతి చెందిన పోలీసుల కుటుంబాలకు భద్రత చెక్కులు



పంపిణీ చేసిన కమిషనర్

**సిద్దిపేట : పెన్ పవర్:**రోడ్డు ప్రమాదంలో మరణించిన కానిస్టేబుళ్ల కుటుంబాలకు పోలీస్ డిపార్ట్మెంట్ భద్రత నుండి వచ్చిన చెక్కులను పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ అందచేసారు.

అనురాధ మాట్లడుతూ పోలీస్ కుటుంబాలకు అండగా భద్రత స్కీమ్ వుంటుందని అన్నారు. విధినిర్వహణలో మృతిచెందిన పోలీసులకు డిపార్ట్మెంట్ ఎప్పుడు అండగా ఉంటుంది. 2024 డిసెంబర్ నెలలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పరంధాములు, వెంకటేష్ కుటుంబ సభ్యులకు పోలీస్ డిపార్ట్మెంట్ తరపున అందవలసిన బెనిఫిట్స్ లో భాగంగా పోలీస్ డిపార్ట్మెంట్ భద్రత నుండి వచ్చిన ఒక్కొక్క కుటుంబానికి 16 లక్షలు మొత్తం 32 లక్షల రూపాయల చెక్కులను వారి కుటుంబ సభ్యులకు అందజేసామని అన్నారు. వాళ్ళ కుటుంబ ఆర్థిక పరిస్థితి తదితర అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. వచ్చిన ప్రతి పైసను జాగ్రత్తగా పిల్లల పేరుపై ఫిక్స్ డిపాజిట్ చేయాలని సూచించారు. పరంధాములు, వెంకటేష్ కుటుంబ సభ్యులకు రావలసిన మరికొన్ని బెనిఫిట్స్ త్వరలో అందజేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఏఓ యాదమ్మ, బి సూపరిండెంట్ అలీషా నిమ్మల ఎస్బి ఇన్స్పెక్టర్ కిరణ్, జూనియర్ అసిస్టెంట్ రవిరాజు, సీసీ నితిన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ మంత్రి

**పెన్ పవర్:**వనపర్తి మండలం అంజనగిరి గ్రామానికి చెందిన బి.ఆర్.ఎస్ కార్యకర్త చింతకుంట హరికృష్ణ యాక్సిడెంట్స్, బుధవారం రోజున మరణించడం జరిగింది. విషయాన్ని, తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి . ఈ రోజు ఉదయం గురువారం వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

మాజీ మంత్రి వెంట, నాయకులు, మాధవరెడ్డి ,డేగ మహేశ్వర్ రెడ్డి, నరేష్, చిట్యాల రాము ,మాజీ,ఉపసర్పంచ్ ధర్మేందర్ ,గ్రామ అధ్యక్షులు రాజు ,యూత్ అధ్యక్షులు యాదగిరి ,నాయకులు రమేష్, రాము, దేవకుమార్, కుర్మయ్య ఆంజనేయులు,వాసుదేవ్ , పాల్గొన్నారు

### ఈదురు గాలులతో నేలకొరిగిన మక్కజొన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి...

**జమ్మికుంట:పెన్ పవర్:** గురువారం రోజున ఇల్లంతకుంట మండలం శ్రీరాములపల్లి గ్రామంలో ఈదురు గాలులతో నేలకొరిగిన మక్కజొన్న పంటలను పరిశీలించిన అనంతరం తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు చెల్పురి రాము. మాట్లాడుతూ శ్రీరాములపల్లి గ్రామంలో సోమవారం సాయంత్రం విపరీతమైన ఈదురు గాలుల వీచడం వలన సుమారు 150 ఎకరాల వరకు మక్కజొన్న పంట నేలకొరిగింది. యాసంగి పంట వేసుకున్న మక్కజొన్న పిసు దశ వచ్చేసరికి మూలిగే నక్కపై తాటి పండు పడ్డట్టు ఈదురుగాలుల వల్ల మక్కజొన్న పంట నేలకొరిగిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వ్యవసాయ శాఖ ద్వారా సమాచారం తెలుసుకొని నెలకొరిగిన మొక్కజొన్న పంటలను వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టపోయిన రైతులకి ప్రభుత్వం నుండి ఎకరానికి 50 వేల రూపాయల నష్టపరిహారం ఇప్పించాలని పేర్కొన్నారు.

# అంతర్ జిల్లా దొంగ అరెస్ట్

**జగిత్యాల,:పెన్ పవర్:**ఇటివల జిల్లా కేంద్రంలో పలు దొంగతనాలకు పాల్పడిన అంతర్ జిల్లా దొంగ ను అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు.గురువారం జగిత్యాల పట్టణంలోని ఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి నిందితుని వివరాలు వెల్లడించారు.మంచిర్యాల పట్టణానికి చెందిన బక్క శెట్టి కొమురయ్య అలియాస్ అజయ్ కుమార్(53) అనే అంతర్ జిల్లా దొంగను పట్టుకోవడం జరిగిందని,ఇతను

గత కొన్ని సంవత్సరాలుగా జగిత్యాల జిల్లా మల్యాల మండలం రాజారాం గ్రామంలో నివాసం ఉంటూ దొంగతనాలే వృత్తిగా గత 28 సంవత్సరాలుగా జీవనం సాగి స్తున్నాడని,2025 జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల వ్యవధిలో వరుసగా జగిత్యాల పట్టణంలోని అరవింద నగర్, హనుమాన్ వాడ, పురానిపేట, గణేష్ నగర్, పద్మ నగర్, గోవిందు పల్లె, కృష్ణానగర్ లలో

ఏడు దొంగతనాలకు పాల్పడ్డాడు. దాదాపుగా ఇతడు ఇప్పటివరకు 25 దొంగతనాలను



పాల్పడినట్టు ఎస్పీ తెలిపారు.ఇతని పై క్రిమినల్ కేసులు నమోదైనవి.ఈనెల 9వ తేదీన పట్టణంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా బక్కశెట్టి కొమురయ్య పోలీసులకు పట్టుబడ్డాడు. ఇతని వద్ద దాదాపు 25 లక్షల విలువ గల బంగారు ఆభరణాలను 286.570 గ్రాముల స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ దొంగను పట్టుకొని అతని వద్ద నుండి దొంగ సొత్తును రికవరీ చేయడానికి ప్రతిభ కనబరిచిన జగిత్యాల పట్టణ ఇన్స్పెక్టర్ వేణుగోపాల్, ఎస్సైలు కిరణ్, గీత, హెడ్ కానిస్టేబుల్ రమేష్, కానిస్టేబుల్ విశాల్, జీవన్, మల్లేష్, గంగాధర్, సంతోష్, రాజిరెడ్డి లను జిల్లా ఎస్పీ అభినందించి రివార్డ్ అందజేశారు.ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, జగిత్యాల డిఎస్పి రఘు చందర్, పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ వేణు, ఇన్స్పెక్టర్ గీత తదితరులు పాల్గొన్నారు

# పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి

**కోరుట్ల,:**పెన్ పవర్:కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు జి. తిరుపతి నాయక్ డిమాండ్ చేశారు, కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలకు వ్యతిరేకంగా గురువారం రోజున కోరుట్ల పట్టణ కేంద్రంలోని కొత్త బస్టాండ్ అంబేద్కర్ చౌరస్తాలో గ్యాస్ సిలిండర్లు,వంట పోయి లతో నిరసన తెలిపారు..ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ మార్కెట్ లో ముడి చమురు ధరలు 2024 నుంచి తగ్గాయని ఇటీవలి కాలంలో అవి మరింత తగ్గాయని కానీ కేంద్ర ప్రభుత్వం ఒకేసారి సిలిండర్ పై 50 రూపాయలను పెంచుతూ ఉత్తర్వులు జారీ చేయడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. ప్రభుత్వ నిర్ణయం వల్ల సబ్సిడీ సబ్సిడీయేతర వినియోగదారులపై తీవ్ర ప్రభావం పడనున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగే గ్యాస్ ధరల ప్రభావం మిగతా నిత్యవసర వస్తు ధరల పై కూడా పడుతుందని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సంక్షోభ భయంతో ప్రజలు అల్లాడుతుంటే ఉపాధి పెంచి




ధరలను తగ్గించాల్సింది పోయి,కేంద్రం గ్యాస్ ధరలను పెంచి ప్రజలపై భారాలను వేస్తున్నదని విమర్శించారు. ఇప్పటికే ప్రజలకు ఉపాధి లేక ఆదాయం లేక నిత్యవసర వస్తువుల ధరల పెరుగుదలతో ఇబ్బందులు పడుతు వారి కొనుగోలు శక్తి క్షీణించిందని ధరలు పెంచుకుంటూ పోతే వారు జీవనం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం పెట్టుబడుదారులకు లక్షల కోట్లు రుణాలు రాయితీలుగా ఇచ్చి ఆ భారాన్ని పేద ప్రజలపై మోపుతున్నదని విమర్శించారు. పెరిగిన గ్యాస్ ధరల వల్ల మహిళలపై తీవ్ర ప్రభావం పడుతుందని నారి శక్తి గురించి బీరాలు పలికే కేంద్ర పెద్దలు మహిళల గోడు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా జిల్లా ప్రజలు కూడా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.. ఈ కార్యక్రమంలోసిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎల్. మహిపాల్ నాయక్,నాయకులు కుంచం శంకర్,ఎంఏ. ఇబ్రహీం, రజియా సుల్తానా,బాబురావు, తిరుపతి,తదితరులు పాల్గొన్నారు

# 72 శాతం బాటిల్ వాటర్ కల్తీవే.. : డబ్బులిచ్చి విషపు నీళ్లు తాగుతున్నామా: సంచలన రిపోర్ట్ ఇంకా ఏం చెబుతోంది..?

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రస్తుతం కర్ణాటకలో అధికారులు ప్యాకేజ్డ్ నీళ్ల బాటిళ్ల శాంపిల్స్ పరిశీలించగా షాకింగ్ విషయం బయటకు వచ్చింది. మొత్తం 296 బాటిళ్లలో కేవలం 95 మాత్రమే తాగదగిన క్వాలిటీ కలిగి ఉన్నట్లు సంచలన నివేదికను ఆరోగ్య కుటుంబ సంరక్షణ మంత్రి దినేష్ గుండు రావు వెల్లడించారు. అంటే మార్కెట్లో దొరుకుతున్న దాదాపు 72 శాతం సరకు నాణ్యతా ప్రమాణాలకు లోబడి లేవని స్టడీలో వెల్లడైంది. వీటిలో చాలా శాంపిల్స్ తాగటానికి పనికిరానివిగా, నాణ్యతా ప్రమాణాలకు సరిపోలనివిగా ఉన్నాయని తేలింది. ఫుడ్ సేఫ్టీ అధికారులు దీనిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారని దినేష్ పేర్కొన్నారు. నీటి శాంపిళ్లలో తాము రసాయనాల అవశేషాలు, ఫ్లోరైడ్, క్యాలిష్యం, మెగ్నీషియం వంటివి గుర్తించినట్లు వెల్లడించారు. ఇక్కడ స్టడీలో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన అనేక బ్రాండ్లు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయని, స్థానికంగా లోకల్




ఉత్పత్తిదారుల బాటిళ్లలో మాత్రం నాణ్యత కొరవడిందని వెల్లడించారు. ఈ దశలో మొత్తం కంపెనీలను లక్ష్యంగా చేసుకోవడం కంటే బ్యాచ్ స్థాయిలో చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు.

ప్రస్తుతం తాము సర్వే శాంపిళ్లను మాత్రమే తీసుకున్నామని, లీగల్ శాంపిల్స్ వచ్చిన తర్వాత ప్రమాణాలను పాటించని సంస్థలపై చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని ఆయన పేర్కొన్నారు. తమకు ప్రజల ఆరోగ్యమే మొదటి ప్రాధాన్యతగా దినేష్ వెల్లడించారు. ఇదే క్రమంలో మార్కెట్ నుంచి సేకరించిన 115 ఫ్రైడ్ గ్రీన్ బఠాణీ శాంపిళ్లలో 70 శాతం ఫుడ్ కలర్స్ కలిపినవి ఉన్నట్లు ఆయన వెల్లడించారు. అలాగే హొటళ్ల తనిఖీలో పెస్ట్ కంట్రోల్ రూల్స్ పాటించని 214 సంస్థలను గుర్తించినట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో 11 హొటళ్లపై

జరిమానాలు విధించినట్లు వెల్లడించారు. ప్రస్తుతం మార్కెట్లో పెద్ద బ్రాండ్లకు అత్యంత దగ్గరగా పోలి ఉండే నకిలీల్లో ఎక్కువగా నాణ్యత కొరవడినట్లు అధికారులు గుర్తిస్తున్నారు. పైగా ఇలాంటి వాటర్ బాటిళ్లలో అధిక స్థాయిల్లో మైక్రో ప్లాస్టిక్స్ ఉంటున్నాయని ఫుడ్ సేఫ్టీ అధికారులు గుర్తించారు. ఇలాంటి కారణాల వల్ల ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ ప్యాకేజ్డ్ వాటర్ ను డిసెంబర్ 2024 నుంచి హై రిస్క్ ఫుడ్ కేటగిరీ కిందకు మార్చింది. అందుకే మార్కెట్లో వాటర్ బాటిళ్లను కొనుగోలు చేసే విషయంలో ప్రజలు అప్రమత్తంగా వ్యవహరిస్తూ నాణ్యతకలిగిన ఉత్పత్తులను కొనుగోలు చేయాలని అధికారులు సూచిస్తున్నారు.

# హనుమాన్ దీక్ష విశిష్టత ఏంటి.. మాల ఎవరు ధరించాలి.. నియమాలు ఏంటి..

**నమ్మినవారికి నేనున్నానంటూ వరాలు ఇచ్చే దేవుడు అభయాంజనేయుడు. శ్రీరాముడిని నమ్మిన భక్త ఆంజనేయుడు. సిందూర ప్రియుడు. ఒక్కసారి మాలధరించి 'అంజన్నా.. అని పిలిస్తే' పలుకుతాడనే నమ్మకం. అందుకే చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు ఒకసారైనా హనుమాన్ మాల ధరించాలనుకుంటారు.ఈ రోజు హనుమాన్ జయంతి సందర్భంగా.. ఆంజనేయుడి మాలా విశిష్టత గురించి తెలుసుకుందాం..**




**హైదరాబాద్ పెన్ పవర్:**చైత్ర, వైశాఖ మాసాల్లో ప్రముఖ ఆంజనేయుడి స్వామి ఆలయాల్లో హనుమాన్ నామస్మరణ మార్మోగుతుంది. కఠిన నియమాలు ఆచరిస్తూ ఆంజనేయుడి సేవలో తరిస్తున్నారు భక్తజనం. మాలధారణ చక్కని నడవడిక, ఆరోగ్యం, ఆధ్యాత్మికత అందిస్తుంది. అందుకే హనుమాన్ మాలకు అంత ప్రాధాన్యం ఉంది.

**కఠిన నియమాలు:**

మద్యం, ధూమపానం లాంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి. వేకువఝామున బ్రహ్మ ముహూర్త శిరస్నానం చేయాలి. దీక్షను స్వీకరించే భక్తులు తెల్లని లుంగీ, కాషాయం చొక్కా ధరించాలి. మధ్యాహ్నం భిక్ష మూడు గంటలకు ముగించాలి. ఒంటిపై చొక్కా విడిచి కండువా, పంచెను నడుముకు కట్టుకుని పూజలు చేయాలి. గంధం, కుంకుమ, సింధూరం, బొట్టు పెట్టుకోవాలి. అబద్ధాలు, అధిక ప్రసంగాలు చేయకూడదు. మూత్ర విసర్జన తర్వాత కాళ్లు చేతులు పరిశుభ్రంగా కడుక్కోవాలి. అప్పుడే మాలధారణకు ఒక అర్థం ఉంటుంది.

**పూజా విధానం:**

'ఓం శ్రీరామ, జయ జయ రామ' అంటూ 108 సార్లు జపించాలి. ఓం శ్రీ రామదూతాయ నమః దీక్ష మంత్రం 108 సార్లు, సర్వదేవత నామ సంకీర్తన చేయాలి. మాతృదేవోభవ, పితృ దేవోభవ, ఆచార్య దేవోభవ, అతిథి దేవోభవ అని స్మరించాలి. అనంతరం గురు బ్రహ్మ, గురు విష్ణు, శు క్లాంబరధరం శ్లోకంతోపాటు హనుమాన్ చాలీసా పదకొండు సార్లు పఠించాలి. స్వామివారి ప్రతిమ ఉన్న మాలలను మాత్రమే ధరించాలి.

**చన్నీటి స్నానం:**

హనుమాన్ మాలధారులు దీక్షా కాలమంతా తెల్లవారుఝాము నుంచి మొదలవుతుంది. చల్లని నీళ్లతో స్నానం చేసి పూజకు ఉపక్రమించాలి. చన్నీటి స్నానంతో మనసుకు హాయి కలుగుతుంది. ఏకాగ్రత పెరుగుతుంది. ఒంట్లో వేడి కూడా తగ్గుతుంది.

**మితాహారం:**

దీక్షాపరులు ప్రతిరోజు మితాహారం మాత్రమే తీసుకుంటారు. మధ్యాహ్నం. భోజనం, రాత్రి అల్పాహారం తీసుకుంటారు. మితాహారం వల్ల శరీరం తేలికగా ఉంటుంది. ఆరోగ్యం బాగుండటంతో పాటు వ్యాధులు. దూరమవుతాయి. సాత్విక ఆహారం తీసుకోవాలి. వెల్లుల్లి, ఉల్లి, మసాలా దినుసులు వాడకూడదు.

**పాదరక్షలు లేకుండా:**

దీక్షా కాలం మొత్తం పాదరక్షలు ధరించరు. కొండగట్టు, మద్దిమడుగు ఇతర యాత్రలకు వెళ్లేటప్పుడు పాదరక్షలు లేకుండానే నడవాలి. పాదాలు నేరుగా భూమిని తాకడం వల్ల రక్త ప్రసరణ హృదయ స్పందనలు మెరుగ్గా ఉంటాయి. నిత్యం నేలపై నిద్రించాలి. భూతల శయనం సుఖం, మనశ్శాంతి ఇస్తుంది. నేలపై పడుకుంటే మనసు ప్రశాంతంగా ఉంటుంది. ఆరోగ్యంగా మేలు చేస్తుంది.


**చల్లని చందనం:**

రెండు కనుబొమల మధ్య మొదటి భాగం విశిష్టమైనది. కుంకుమ, విబూది, గంధం, చందనంలో ఏదో ఒకటి పెట్టుకోవడం వల్ల ఆలోచనలు స్థిరంగా ఉంటాయి. నాడీ మండలానికి కేంద్రమైన నుదుటి బొట్టు సున్నితమైంది. ఆరోగ్యదాయకమైంది.

**కాషాయ దుస్తులు:**

మాలధారులు కాషాయ దుస్తులు ధరించాలని నియమం ఉంది. ఎండాకాలంలో దీక్షలు వేయాల్సి ఉంటుంది. ఎండ వేడి కాబట్టి వెంటనే గ్రహించి రక్షణ కల్పించడంలో కాషాయపు రంగు ఉపయోగకరంగా ఉంటుంది.

# నిర్మల్ జిల్లాలో 30 వేల మొక్కలు అగ్నికి ఆహుతి.. ఏం జరుగుతోంది..



**హైదరాబాద్ పెన్ పవర్:**నిర్మల్ జిల్లాలో ఫారెస్ట్ అధికారుల నిర్లక్ష్యానికి సుమారు 30 వేలకు పైగా మొక్కలు అగ్నికి ఆహుతయ్యాయి.. జిల్లాలోని కడెం మండలం ఉడుంపూర్ రేంజ్ పరిధిలోని రాంపూర్ బీట్ లో చోటు చేసుకుంది ఈ ఘటన. నాలుగు రోజుల క్రితం పునరావాస కాలనీలో ఉన్న ప్లాంటేషన్ బేస్ లో అగ్గి రాజుకోవడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటన పట్ల ఫారెస్ట్ అధికారులు నిర్లక్ష్యం వహించడంతో సుమారు 30 వేలకు పైగా మొక్కలు బూడిద పాలయ్యాయి.లక్షలు విలువజేసే మొక్కలు అగ్నికి ఆహుతవుతున్నా కూడా పట్టించుకోలేదు అటవీ అధికారులు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్లాంటేషన్ వృథా అవుతోందంటూ మండిపడుతున్నారు స్థానికులు. ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు స్థానికులు.

## ఫామ్‌హౌస్ నుంచి నేరుగా ఏఐజీ ఆస్పత్రికి కేసీఆర్..ఉన్నట్టుండి ఏమైంది.?




**హైదరాబాద్ పెన్ పవర్:**బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రికి చేరుకున్నారు. ఏప్రిల్ 10న గజ్వేల్ లోని తన ఫామ్ హౌస్ నుంచి హైదరాబాద్ కు వచ్చారు. జనరల్ హెల్త్ చెకప్ కోసం ఆస్పత్రికి వచ్చినట్లు ఆయన వ్యక్తిగత సిబ్బంది చెబుతున్నారు. ఈ మధ్యనే కేసీఆర్ ఏఐజీ ఆస్పత్రికి వెళ్లి టెస్టులు చేయించుకున్నారు. గతంలో సోమాజీగూడలోని యశోద ఆస్పత్రికి వెళ్లిన కేసీఆర్..ఇపుడు ఎలాంటి ఆరోగ్య సమస్యలు వచ్చినా గచ్చిబౌలి ఏఐజీ ఆస్పత్రికి వెళ్తున్నారు.

అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం డిసెంబర్ 8, 2023 కేసీఆర్ తన ఫామ్ హౌస్ లో కాలు జారీ పడిపోయిన సంగతి తెలిసిందే..ఈ ప్రమాదంలో తన మోకాలి తుంటి మార్పిడి ఆపరేషన్ జరిగింది. రెండు మూడు నెలల పాటు రెస్ట్ తీసుకున్నారు. మళ్లీ అడపాదడపా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. మార్చి 19న బడ్జెట్ ప్రవేశ పెట్టిన రోజున అసెంబ్లీకి హాజరైన కేసీఆర్.. వరంగల్ లో నిర్వహించనున్న బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ వేడుకలపై తన ఫామ్ హౌస్ లో ఉమ్మడి జిల్లాల నేతలతో వరుస భేటీలు నిర్వహిస్తున్నారు.

# బంగారు బిస్కెట్లు.. పెళ్లి చీరలు.. ఉబెర్ క్యాబ్‌లో ప్రయాణికులు మర్చిపోయిన విలువైన వస్తువులు ఇవే




**హైదరాబాద్ పెన్ పవర్:** జేబులో ఉన్న రూ.100 నోటు ఎక్కడైనా పడిపోతేనే ఉక్కిరిబిక్కిరి అవుతాం. అలాంటిది మనం ప్రయాణించిన క్యాబ్?లో లక్షల విలువ చేసే గోల్డ్, ఇతర విలువైన వస్తువులు మర్చిపోతే ఇంకా ఎలా ఉంటుందో ఆలోచించండి. ఒక్కసారిగా గుండె ఆగినంత పనైపోతుంది. టెన్షన్, తొందర, మతిమరుపు వంటి కారణాల వల్ల మనం కొన్నిసార్లు ప్రయాణాల్లో వస్తువులను మర్చిపోవడం లేదా పొగుట్టుకోవడం జరుగుతుంటుంది. ఈ క్రమంలోనే 2024లో తమ క్యాబ్ సర్వీసుల్లో వినియోగదారులు మర్చిపోయిన విలువైన వస్తువుల లాస్ట్ %డ% ఫౌండ్ జాబితాను విడుదల చేసింది. ఇందులో పలు ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. బ్యాగులు, పర్సులు, కీ, కళ్ళజోడు, ఇయర్ ఫోన్లు, ఫోన్లు మర్చిపోవడం కామన్. కానీ కొంతమంది పెళ్లి చీర, బంగారు బిస్కెట్ వంటి అత్యంత విలువైన వస్తువులు క్యాబ్?లో వదిలివెళ్లినట్లు ఉబెర్ వెల్లడించింది.

తిరిగి ఆ వస్తువును మళ్లీ కస్టమర్లకు అందజేసినట్లు తెలిపింది.

క్యాబ్‌లో అత్యధికంగా వస్తువులు మర్చిపోయిన తొలి నగరంగా దేశ ఆర్థిక రాజధాని ముంబై నిలిచిందని నివేదిక స్పష్టం చేసింది. ముంబైలో చాలా మంది కస్టమర్లు తమ వస్తువులను క్యాబ్?లో మర్చిపోయి వెళ్లినట్లు తేలింది. ఈ జాబితాలో రెండో ప్లేస్?లో దేశ రాజధాని ఢిల్లీ నిలిచింది. ఆ తర్వాత స్థానాల్లో పూణే, బెంగళూరు, కోల్‌కతా వంటి నగరాలు ఉన్నాయి. హైదరాబాద్ కస్టమర్లు తమ వస్తువులను క్యాబ్?లో చాలా తక్కువగా మర్చిపోతారని వెల్లడించింది. 2024లో ఎక్కువగా శనివారం రోజు కస్టమర్లు తమ వస్తువులను క్యాబ్?లో మర్చిపోయి వెళ్లారని తేలింది.

**ఉబర్ క్యాబ్‌లలో ప్రజలు మరచిపోయే టాప్ 10 వస్తువులు:**

బ్యాక్‌ప్యాక్ / బ్యాగ్
ఇయర్ ఫోన్లు / స్పీకర్
ఫోన్‌జి
వాలెట్ / పర్స్
కళ్ళద్దాలు / సన్ గ్లాసెస్
కీలుజి
దుస్తులుజి
ల్యాప్‌టాప్‌జి
నీటి సీసా / సీసా
పాస్‌పోర్ట్‌జి

# తిరిగి కట్టక్కర్లేని లోన్.. 50వేలకు 100% సబ్సిడీ.. దరఖాస్తు గడువు పొడిగింపు




**హైదరాబాద్ పెన్ పవర్:**ప్రస్తుతం సంక్షేమంతో పాటు అభివృద్ధిని సమానంగా తెలంగాణ ప్రభుత్వం ముందుకు తీసుకెళుతోంది. ఈ క్రమంలో సొంతంగా వ్యాపారాలు నిర్వహించుకునే యువతకు చేయూతను అందించేందుకు రాజీవ్ యువ వికాసం స్కీమ్ ప్రకటించింది రేవంత్ రెడ్డి సర్కార్. దీని కింద అర్హులైన ప్రజలకు ఏకంగా 100 శాతం వరకు సబ్సిడీపై రుణాలను అందించేందుకు మార్గదర్శకాలను జారీ చేసింది.

తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించేందుకు రాజీవ్ యువ వికాసం పథకాన్ని డిజైన్ చేసింది. దీని కింద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన నిరుద్యోగ యువతకు ఆర్థిక సహాయం అందించబడుతుంది. ముందుగా దీని దరఖాస్తుకు ఈనెల 5 వరకు గడువు ప్రకటించినప్పటికీ ఆదాయ ధృవీకరణ పత్రాల జారీలో తలెత్తిన సమస్యల కారణంగా ప్రభుత్వం దరఖాస్తుల స్వీకరణ గడువును ఈనెల 14 వరకు పొడిగించటంతో ప్రస్తుతం చాలా మంది యువత దీనిని వినియోగించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. దరఖాస్తు సమయంలో రేషన్ కార్డు ఉన్న వారు దాని నెంబర్ అందించాల్సి ఉండగా, ఇది లేని వారు మాత్రం ఇన్కమ్ సర్టిఫికెట్ సమర్పించటం తప్పనిసరి.

**రాజీవ్ యువ వికాసం పథకం ముఖ్యాంశాలు:**

**రుణ మంజూరు మొత్తం:** రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.6వేల కోట్లతో.. దాదాపు 5 లక్షల మంది నిరుద్యోగ యువతకు రుణాలు మంజూరు చేసే లక్ష్యంతో స్కీమ్ డిజైన్ చేయబడింది ?

**రుణ రాయితీ వివరాలు:**

– యూనిట్ ఏర్పాటు కాస్ట్ రూ.50వేలు ఉంటే 100 శాతం రుణ సబ్సిడీ అందించబడుతుంది.
యూనిట్ ఏర్పాటు ఖర్చు రూ.50వేల నుంచి రూ.లక్ష లోపు ఉంటే 90 శాతం పొందిన రుణంలో సబ్సిడీ ఇవ్వబడుతుంది.
యూనిట్ ఏర్పాటుకు రూ.లక్ష నుంచి రూ.2లక్షలు ఉంటే రుణంలో 80 శాతం సబ్సిడీ అందించబడుతుంది.
చివరిగా యూనిట్ ఖర్చు రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల మధ్య ఉన్నట్లయితే తీసుకున్న రుణంలో 70 శాతం రాయితీ అందించబడుతుంది.
రుణాలను పొందిన వ్యక్తులు సబ్సిడీ మ్నొత్తం పోగా కేవలం మిగిన మ్నొత్తాలను మాత్రమే స్కీమ్ కింద చెల్లించాల్సి ఉంటుంది. ఏప్రిల్ 6 నుంచి మే 31 వరకు దరఖాస్తుల పరిశీలన కొనసాగనుండగా.. జూన్ 2 తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజున తుది జాబితాను అధికారులు విడుదల చేయనున్నట్లు వెల్లడైంది.
దరఖాస్తుకు ఎవరు అర్హులంటే..?
తెలంగాణ రాష్ట్రానికి చెందిన నిరుద్యోగ యువత?
ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందినవారు?
విద్యార్హత, వయోపరిమితి 21 నుంచి 60 లోపు అధికారిక నోటిఫికేషన్‌లో పేర్కొన్నట్లు ఉండాలి
గ్రామీణ ప్రాంతంలో వార్షిక ఆదాయం రూ.లక్ష 50 వేల లోపు ఉండాలి
పట్టణ ప్రాంతంలో వార్షిక ఆదాయం రూ.2 లక్షల లోపు ఉండాలి

**దరఖాస్తు చేసేందుకు అవసరమైన డాక్యుమెంట్లు:**

ఆధార్ కార్డు
తెలంగాణ డొమిసిల్ సర్టిఫికేట్?
క్యాస్ట్, ఇన్‌కమ్ సర్టిఫికేట్లు?
బ్యాంకు ఖాతా వివరాలు?
రేషన్ కార్డు?
ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ రిజిస్ట్రేషన్?
డ్రైవింగ్ లైసెన్స్
పట్టాదారు పాస్ పుస్తకం
పాస్ పోర్ట్ సైజు ఫొటో

**రుణ మంజూరు, చెల్లింపు వివరాలు:**

రాజీవ్ యువ వికాసం పథకం కింద మంజూరు చేయబడిన రుణంపై, ప్రభుత్వ రాయితీని తీసివేసిన తరువాత, లబ్ధిదారులు తాము చెల్లించవలసిన మొత్తాన్ని బ్యాంకుకు చెల్లించాలి. రుణ చెల్లింపు కాలపరిమితి, వడ్డీ రేట్లు, ఇతర వివరాల కోసం, అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించడం లేదా సంబంధిత బ్యాంకుతో సంప్రదించడం మంచిది.?దరఖాస్తు ప్రక్రియను ఆన్ లైన్ ద్వారా పూర్తి చేయవచ్చు. స్కీమ్ వివరాలను సైతం ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చు.